కథా నిలయం
3577
శ్రీకాకుళం

# మిథ్యా బ్రతుకులు

ప్రొద్దున్నే లేవంగానే బాదమాకులు కొయ్యటంతో ఒకగంట కాలక్షేపం జరిగి
పోయేది. క్రిందటి రోజు సాయంత్రము కృష్ణ ఒడ్డుకు వెళ్ళి తెచ్చిన
బద్దలతో ఆ యాకు లన్నింటికి విస్తరాకు రూపాలు వచ్చేవి. దాంతో గడియా
రము ముల్లు తొమ్మిది దాటిపోయేది. విస్తళ్ళు అవంగానే వంట అయిందా
అని ఒక అరుపు అరిచేశేవాడు. ఉమెగారు గళమెత్తి, యింట్లోకి కావాలసి
సవి, అక్కర్లేనివి యే కరువు పెడితే, యీాయనగారు బిళ్ళగోచి సవిరించు
కుంటూ, నీరు కావి వస్త్రము పైన వేసుకుని ఒక చిన్న కమండలము పుచ్చు
కుని గడప దాటతాడు. పదకొండు కొట్టేటప్పటికి అంగ వస్త్రమునిండా
అమాంబాపతు కాయలు, కమండలమునిండా నెయ్యి, పెరుగుతో నిండిన
ఒక మృణ్మయ పాత్రతో కొంపలో హాజరయ్యేవాడు.

ఇంట్లో యెంత లేదన్నా, అడ్డెడు తప్పాలా లేవాల్సిందే. వంటకు
అంతూలేదు. తిండికి అంతూలేదు. అమ్మయ్య అంటూ త్రేణుస్తూ మంచం
మీద వత్తిగిలాడో లేదో, శాస్తుర్లుగారూ యివ్వాళ వర్జ్యము యెప్పుడుందో
చూడండి. అవధాన్లుగారూ ప్రయాణానికి యివ్వాళ మంచిదేనండి, సిద్ధాంతి
గారూ, మావాడి ఔపోసన కార్యానికి లగ్నం చూసి పెడుదురూ—అంటూ
అనేక రకాల మనుష్యులు అనేక పేర్లతో యీాయన హృదయాన్ని గిలిగింతలు
పెట్టేవాళ్ళు. ఎవరిమాటైనా కాదనటానికీ మాత్రం ఆయనకు వీటిల్లో లాభం
లేకపోతేగా! పంచాగం దగ్గర నుంచి పరబ్రహ్మం వరకు ఒకటే యేకధాటిగా
చెప్పి వప్పించి సంతృప్తిపరచగల శక్తి ఆయనలో వుంది కాబట్టే, ఏనాడైనా
జనం రాలేదు అనే అసంతృప్తి ఆయనలో కలగలేదు. ఆయన చెపుతున్నంత
సేపు శిలావిగ్రహాల్లాగ నిలబడి కళ్ళు అప్ప చెప్పాలిసిందే కాని యిదెందుకని,
యిదేమిటని అవతల వాళ్ళకు అడిగే సావకాశమే యివ్వకపొతే వాళ్ళు
మాత్రం యేం చేస్తారు.

అయిదు గంటలదాక యిలాంటి సంభాషణలే కాలాన్ని మ్రింగేసేవి. అయన ఆచారం ప్రకారము అయిదు తర్వాత తప్పనిసరిగా నిర్వర్తించవలసిన కొన్ని విధుల్ని పూర్తి జేసేవాడు. పర్వదినాల్లో పురాణాలు, భాష్యాలు, కొద్దిపాటి వుపన్యాసాలు ప్రేక్షక లోకాన్నిబట్టి చెప్పగల సామర్థ్యం అయనలో వుంది కనకనే, అయన యేది చెప్పటానికి మొదలు పెట్టినా అందరూ తల వూపుతూ దిగ్భ్రమ చెందిపోయేవారు.

అయన కార్యక్రమాల్లో టూకీగా చెప్పవలసిన ఘట్టాలు యింతకంటె లేవనే చెప్పాలసి వస్తుంది. అయనకు ఆ వూరు పొలిమేరదాటి పోవాలసిన అవసరము కలగనే కలగలేదు. దాని మూలాన, ఆ వూరు కదిలి వెళ్ళకూడదనే ఒక భావము కూడ అయనలో ప్రవేశించినట్లు, అయన దగ్గర బంధువులు అయనను అంటూ వచ్చారు కూడ. ఆ మాటలు కూడ అయనకు ఒక విధమైన గౌరవమే అని అనిపిస్తూ వచ్చింది.

సంతానం ఏడాది ఏడాదికి పెరుగుతూ వస్తోంది. 'బడితెల్లాగ అట్లా వీధుల్లో తిరిగి తందనా లాడకపోతే, చదువు సంధ్య అంటూ ఏదైనా చూసుకోరాదు' అంటూ ముసలమ్మ మూలుగుడు ధ్వని అయన చెవిదాక ఇప్పుడిప్పుడే వస్తూవుంటే, అయన రాత్రిళ్ళు నక్షత్రాల వంక చూస్తూ అట్టే అలోచనల్లోకి దిగుతూ వున్నాడు.

"మనమవుతే యేదో విధంగా కాలం వెళ్ళబుచ్చుతున్నాం. కాని పిల్లలు కూడ యీ విధంగానే గడప గలుగుతారా" అనే ప్రశ్న అయనను బాగా బాధించటం మొదలు పెట్టింది. తన అలోచనా ప్రవాహం రోజూ రోజూ అనేక డొంకల్లోకి మెలికలు మెలికలుగా తిరిగి పోతోంది. ఏ దారి నిర్ణయించుకోవాలో తెగక సతమతమయి పోతున్నాడు.

ఆనాడు అయన వంటరిగా పున్నమినాడు యిదే అలోచనతో యింట్లోంచి బైటకువచ్చి, వూరు పొలిమేరవరకు నడక సాగించాడు. తన

వూరునుంచి యీ మధ్యనే ఒక కంకరరోడ్డు బస్తీ వైపునకు వేసింది చూశాడు. ఆ కంకరరోడ్డు చివరిదాక తన మనస్సు పరుగెత్తింది. కాని అంత బస్తీలో ఆ మనస్సు నిలవదొక్కుకో లేకపోయింది. వెంటనే దక్షిణంగావున్న రోడ్డును చూశాడు. ఆ రోడ్డు అంతా గండ్లు బురద, కనీసము మూడు నాలుగు సార్లయినా వాగుల్లొ నడిచిపోవాలి. తన మనస్సు ఆ రోడ్డు గమ్యస్థానాన్ని ఒక్క క్షణంలో ఆకర్షించింది. ఆ వూరు అంతా అయనకు కళ్ళకు కట్టినట్లు యింది కాసేపు అట్లాగే నిలబడిపోయాడు. ఒక్క క్షణంలో గిర్రున యింటికి తిరిగి వెళ్ళిపోయాడు.

విదియనాడు సాయంత్రం శాస్త్రుల్లుగారు వూరు వెళ్ళారనేటప్పటికి అందరికీ ఆశ్చర్యం వేసింది.

ముక్తసరిగా ఒకళ్ళింటికి వెళ్ళి యేవో కొన్ని మంతనాలు జరిపి ఆనాడు రాత్రికే యింటికి వచ్చేశాడు. మర్నాడు కొన్ని గ్రంథాలు పట్టుకుని మళ్ళా ఆ వూరు చేరుకున్నాడు. అప్పటికప్పుడే ఆయన చుట్టూ ఒక బృందము అంటూ యేర్పడింది. బొందితో స్వర్గానికి వెళ్ళదలచిన ప్రతి ఒక్కరూ మెల్లి మెల్లిగా అయన దగ్గరకు చేరుకుంటున్నారు.

పొరుగూరునుంచి రోజూ రావటం కష్టమని, యీ వూళ్ళోనే యేదో రకంగా కొన్ని యేర్పాట్లు చెయ్యాలని గుసగుసలు బయలు దేరినాయి. అయితే గంటకట్టే దెవరు? డబ్బుతో పనేను. అవేళటికి తమ దాక వస్తే యేదో శక్త్యానుసారం సమర్పించుకుని కృష్ణార్పణం అంటూ చేతులు జోడిద్దామనుకునే వాళ్ళు కొందరు. డబ్బివ్వనివాడు పడవ ముందెక్కినట్లు ఒకాయన నడుముకట్టి ముందుకొచ్చాడు. దాంతో అయనగారి స్థావరము యీ వూరే అయిపోయింది.

అయన పిల్లలందరికి నూనె ప్రమేయం లేకుండా తలకాయలు చేసేసి ఆచారానికి విరుద్ధం కాకూడదని శిఖలాంటిది ఒకటి యేర్పరుస్తే, ఆ వూళ్ళో

చాలా మంది మంగలివాళ్ళకు పని తక్కువ చే[illegible]. జుట్టు, జొట్టు, కట్టు స్వర్గానికి నిచ్చెనలువేసే మనస్తత్వం గలవాళ్ళ [illegible]దనుగుణంగా తయా కూర్చున్నారు.

ఆయన దైనందిన కార్యక్రమంలో పూర్తి మార్పు వచ్చేసింది. దై చింతన, ముక్తిమార్గాలు, ఆ వాతావరణంలో యెవరు యెవరితో యేమి మాట్లాడుతున్నారో అర్థంకాకుండా పోయింది.

"మనవి మిథ్య బ్రతుకులు. ఇదంతా ఒక కల మాదిరి. కలలో మనము అన్నీ అనుభవిస్తాము. నిజమే అనుకుంటాం. కళ్ళు తెరిచి చూసే టప్పటికి యేమీ వుండదు. అట్లాగే యీ జీవితము ఒక దీర్ఘకల. ఈ విష యము తెలుసుకోలేక సతమతమయిపోతూ వుంటారు. అందువలన పార మార్థిక చింతనే మనము యీ నియమిత కాలంలో అలవరచుకో వలసినది. ఈ వున్న కాసేపు భగవద్భక్తి, భగవధ్యాన్నము మీద మన మనస్సులు కేంద్రీ కరింపబడాలి. "నువ్వూలేవు నేనూ లేను." అంటూ అద్వైత లోతుల్లోకి పోతూ వుంటే, యీ ప్రభావము యింటి దగ్గరకూడా పతులు చూపిస్తూవుంటే, ఖాళీ డబ్బాలన్నీ యే కరువుపెట్టి, ధర్మపత్నులు యెంత మంది పతుల్ని కార్యోన్ము ఖుల్ని చెయ్యటంలో సఫలీకృతులయ్యారో దురూహ్యం.

తాత్కాలికోద్రేకం వలన ఆయన వాక్కులు చాలా మంది మనస్సుల్లో చాలా రోజుల వరకు స్థావరం యేర్పరచుకో గలిగినాయి.

నాలుగేళ్ళ క్రొత్త జీవితంలో, ఆయనగారు, ఆయన కుటుంబం ముందుకు పోయినంత త్వరగా, మిగతా వారంతా పోలేకపోగా, వారి వారి వృత్తుల్లో యీ నాలుగేళ్ళు వెనకబడి వున్నారని చెప్పక తప్పదు.

మరికొన్నాళ్ళకు ఆయనగారు ఆ వూరుకూడా మారిపోవటం తటస్థిం చింది. పెద్ద కుమారుడు యింట్లోంచి లేచిపోయాడు. రెండవవాడు

క్రిష్టియన్ కాలేజీలో చదువుకుంటున్నాడు. మూడవవాడు మిషన్ స్కూల్‌లో టైపిస్టు, ఇక వరస నంబర్లు, హైస్కూళ్ళలోను, కాలేజీలలోను విద్యార్థులుగా వ్యవహరింపబడుతున్నారు.

తలకాయల్ని చూసి యిట్టే గుర్తుపట్టగల ఆయన కుమాళ్ళను ఒకసారి ఆ వూరాయన రైల్లో కలుసుకున్నప్పుడు పలకరిస్తే, మీ రెవరో నాకు తెలీదంటూ హాటుతీస్తూ యింగ్లీషులో సమాధానము యిచ్చాడు ఒక పుత్రుడు. ఆయనగారు పదేళ్ళ మిథ్య బ్రతుకులో సంపాదించింది రెండు మూడు తరాల దాక ఆయన వంశంలో యెవరూ కూడా బ్రతుకు మిథ్య అనే అవకాశము కలగకుండా సరిపోతుంది.

జీవితంలో ఆయన సంపాదించింది యిదే. ఆయనకు తృప్తి యిదే. పల్లెటూళ్ళో, పూరిపాకలో కాలంతోపాటు కదిలిపోతూ ఒకనాడు పృథ్విమ తల్లిని కరుచుపోయే యీ జీవితాల్లో యెంత మార్పు అని ముక్కుమీద వేలు వేసుకుని గదిలో సోఫాలో కూర్చుని ఆశ్చర్యపడుతూ వుంటారు.

అయన ఆచారాల్లో కాని, ఆయన అలవాటుల్లో కాని యీనాటి వరకు యేమీ మార్పు రాలేదు. జీవితం మిథ్య అని గట్టిగా నమ్మిన ఒక సిద్ధాంతి. అయితే యీ బ్రతుకు మధ్యలోనే కావలసిన కొన్ని సౌకర్యాల్ని అవసరంగా యేర్పాటు చేసుకొవాలనే నగ్నసత్యాన్ని అనుభవరీత్యా తెలుసుకున్న ఒక లౌకికుడు. తన పిల్లలందర్ని కాలంతోపాటు ముందుకునెట్టి, తాను స్థిరమైన సిద్ధాంతాన్ని వదిలిపెట్టక, జీవితయానాన్ని అతి సునాయాసంగా సాగిస్తూ వస్తున్న ఒక ఆధ్యాత్మిక వాది.

ఒకనాడు అయన ఆ క్రొత్త వూళ్ళో యెవరితోనో "మన బ్రతుకులు క్షణభంగురములు. ఏ క్షణం ఏమవుతుందో యెవరికి తెలియదు. నాకు యీ వూళ్ళో మేడ వుందని, అవతల వూళ్లో పొలంవుందని, నాకు యీనాటికి కూడ ఆర్జన బాగా వుందని మీరంతా అనుకుంటూ వుంటారు. అదంతా

భ్రమే. నేను కన్ను మూసిననాడు వీటన్నిటితో నాకు సంబంధము యేమిటి? అయితే మనము వున్నన్నాళ్ళు యీ జీవుడికి యింత ఆహారము పడెయ్యక పోతే తనువును యీడ్చే దెట్లాగు. దానికే యిన్ని అవస్థలు, యిన్ని అగచాట్లు మనము యెప్పుడో ఒకప్పుడు యీ శరీరాన్ని చాలించి పరబ్రహ్మంలో కలిసి పోవాల్సిందే. అందుకనే మనవి మిధ్య బ్రతుకులు అన్నారు........" అంటూ వుపదేశం చేస్తూవుండగా, ఆయనగారికి పదేళ్ళ క్రిందట శిష్యుడుగావున్న ఒక మోతుబరి యీయనను దర్శిద్దామని వచ్చి, యివన్నీ వింటూ, మనస్సు ఒప్పక, గుండె బాదుకుంటూ, వెనక్కు తిరిగి" "మిధ్యబ్రతుకు ఆయనది కాదు. నాది. అన్ని విధాల చెడిన నాది. ఇటు ఇహంలోనూ బ్రతుకు మిధ్యే, అటు పరంలోనూ అంతే........" అంటూ వణుక్కుంటూ, ఆయనగార్ని చూడకుండానే కాలికి బుద్ధిచెప్పాడు—ఇలాంటి మిధ్య ప్రపంచంలో యెవ రైనా యింత కడుపుకు అన్నం పెడతారేమోనని.